
ప్రజాశక్తి

మంగళవారం 12 మార్చి 2024



13న జాబ్ మేళా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీవరం తెలిపారు. ఈ ఉద్యోగమేళా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, హెటరొట్ , అపోలో ఫార్మసీ, బ్యాంక్ కంపెనీలు జాబ్ మేళా నిర్వహిస్తాయని తెలిపారు. ముఖ్యంగా కెమిస్ట్రీ విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణమైన అభ్యర్థులు, లేదా ఏదైనా డిగ్రీ, ఇంటర్‌లో పాస్ అయిన అభ్యర్థులు ఈ ఉద్యోగమేళాకు హాజరుకావాలని, నిరుద్యోగ యువతను ఈనెల 13న కళాశాలకు నేరుగా వచ్చి ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ జిరాక్స్ ప్రతులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని అన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బయట పెట్టాలి

సిపిఎం ఆధ్వర్యాన ఎస్‌బిఐల వద్ద నిరసనలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, ఇప్పటి వరకు స్వీకరించిన బాండ్ల వివరాలన్నింటినీ వెంటనే సుప్రీంకోర్టుకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం బ్యాంక్ మేనేజరుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ ఎస్‌బిఐ గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు, వాటిని కొన్నవారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి ఈనెల 6లోగా బ్యాంక్ అందించాలని, ఆ వివరాలను ఇసి ఈనెల 13లోగా బహిర్గతపరచాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బిఐ విఫలమైందన్నారు. ఈ సమాచారాన్ని ఇవ్వడానికి ఎస్‌బిఐకి ఇచ్చిన మూడు వారాల గడువు ముగిసిందని, ఆ వివరాలను వెల్లడించడానికి బదులు ఎస్‌బిఐ గడువు ముగుస్తున్న సమయంలో మరో 116 రోజులు అదనపు గడువు కావాలని కోర్టును ఆశ్రయించడం హాస్యాస్పదమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, అభివృద్ధి చెందిన భారతదేశంలో, డిజిటల్ ఇండియాను పూర్తిస్థాయిలో అమలు చేశామన్న మోడీ రాజ్యంలో, బాండ్ల వివరాలు కంప్యూటర్లలో లేవని, జూన్ 30 కల్లా కోరిన సమాచారమంతా అందచేస్తామని ఎస్‌బిఐ కోర్టుకు తెలపడం అంటే ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా వుండేందుకు పన్నాగం పన్నినట్టు స్పష్టమవుతోందని అన్నారు. ఎస్‌బిఐ తీరు బిజెపికి తోడ్పడేదిగా ఉందని, తన కార్యకలాపాలన్నింటినీ డిజిటలైజ్ చేసిన ఎస్‌బిఐ ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను కొద్ది రోజుల్లో పొందుపర్చి ఇవ్వలేక పోయిందంటే నమ్మశక్యంగా లేదని, మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బిఐ ఈ వైఖరి తీసుకుందని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నీ ఎస్‌బిఐ ఇసి అందచేయాలని, కోర్టును ధిక్కరించిన ఎస్‌బిఐపై సుప్రీం కోర్టు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తుల్లో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బంటు దాసు, గొర్లి వెంకటరమణ, బి.సూరి బాబు, పి.రాజశేఖర్, పాకల సన్యాసిరావు, ఎస్.నాగేశ్వ రావు, పి.రాము, బలరాము, జి.తులసి, పి.రవి, వరహాలు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలోఎస్‌బిఐ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సాలూరు: ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను సుప్రీంకోర్టుకు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన కార్యకర్తలు స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాండ్ల కొనుగోలులో జరిగిన అక్రమాలను దాచి పెట్టే ప్రయత్నంలో మోడీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్‌పై ఒత్తిడి పెంచుతోందని ఆరోపించారు. వెంటనే బాండ్ల వివరాలు అందజేయాలని డిమాండ్ చేశారు.అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

జగనన్నకు చెబుదాంకు 100 అర్జీలు


ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాంకు కార్యక్రమానికి వంద అర్జీలు అందాయి. ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఎల్విన్‌పేట ఎస్‌డిసి (ట్రైబల్ వెల్ఫేర్) ఆర్‌వి సూర్యనారాయణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీల్లో కొన్ని....

సాలూరు మండలం జిల్లేడువలస పంచాయతీ పరిధిలోగల గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక అనారోగ్యంతో ఉన్నవాళ్లను ఆసుపత్రికి తీసుకువెళ్లే సౌకర్యం లేక ప్రాణాలు పోతున్నాయని, రోగులను డోలి మీద మోసి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తుందని, కావున రోడ్లు మంజూరు చేయాలని గిరిజన సంఘం నాయకులు సీదరపు అప్పారావు, గ్రామస్తులు కోరారు. పార్వతీపురం పట్టణం మేదర వీధిలో పాత కరెంటు స్తంభాలు తుప్పు పట్టాయని, సరిపడా కరెంట్ స్తంభాల్లేక ఒకే స్తంభానికి ఎక్కువ లైన్లు అమర్చి ఉండడంతో సర్వీస్ వైర్లు తెగిపోతున్నాయని, కావున అదనపు స్తంభాలను ఏర్పాటు చేయాలని, అలాగే కాలువల్లో పూడికలు తొలగించాలని గ్రామానికి చెందిన పి.శ్రీనివాసరావు దరఖాస్తు అందజేశారు. సీతంపేట మండలం తాబేలువలసకు రోడ్డు సదుపాయం లేక విద్య, వైద్యం, రవాణా సదుపాయానికి ఇబ్బందిగా ఉందని, గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని ఎం.లక్కాయి, గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. గుమ్మలక్ష్మీపురం మండలం రెల్లలో ఎస్.టి పెదవీధికి, టిక్కబాయి గ్రామానికి కరెంట్ లైన్ ఇప్పించాలని కె.దీనమయ్య అర్జీ అందజేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 63/1లో అక్రమ శాశ్వత నిర్మాణాలు నిలిపివేయాలని కె.సుమతి అర్జీ అందజేశారు. ఇదే మండలం సన్యాసి రాజుపేటకు చెందిన ఎ. రామారావు సదరం ఇప్పించాలని కోరారు. పార్వతీపురం మండలం బందలుప్పికి చెందిన జి.దమయంతి హౌసింగ్ బిల్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. బలిజిపేట మండలం అజ్జాడకు చెందిన జి.కృష్ణమూర్తి పిఎం కిసాన్ మంజూరు చేయాలని, కొమరాడ మండలం విక్రంపురం గ్రామానికి చెందిన కె.శారద పెన్షన్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పలువురు జిల్లాశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో...

పార్వతీపురంరూరల్ : ప్రజల నుండి వచ్చే వివిధ రకాల స్పందన ఫిర్యాదులపై త్వరితగతిని స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జెసి శోభిక

ఫిర్యాదుదారుల రాతపూర్వక అర్జీలను ఎస్పీ స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదులపై ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఆ ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త,అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలు, ఇతర సమస్యల గురించి ప్రజలు వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమంలో ఎఎస్పీ (అడ్మిన్) డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్‌కుమార్, ఎస్‌బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ, బిఎండి ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎలో...

సీతంపేట : గిరిజన స్పందనకు 29 వినతులు వచ్చాయి. సోమవారం స్థానిక ఐటిడిఎలో పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో కొన్ని... నేరడిగూడకు చెందిన విజయ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. చిన్నబగ్గ కాలనీకి చెందిన వెంకట్రావు కొండపట్టా ఇప్పించాలని, సవరభోంగి గూడకు చెందిన లక్ష్మి వితంతు పెన్షన్ మంజూరు చేయాలని, నల్ల బొంతుకు చెందిన ప్రసాద్ సిసి రోడ్డు మంజూరు చేయాలని విన్నవించారు. ఇక్రపాడుకు చెందిన రాము మున్సిపాలిటీ బిల్లులు చెల్లించాలని, బురిజిపేట లక్ష్మి పివిటిజి ఇళ్ల కాలనీ బిల్లు మంజూరు చేయాలని, కోనంగికి చెందిన వరలక్ష్మి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి అన్నదొర, ఇఇ సింహాచలం, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, పిహెచ్‌ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ, సిడిపిఒ రంగలక్ష్మి, ఎఎంఒ కోటిబాబు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు

అనుమతుల్లేని ఇసుక రీచ్‌లను నిలిపివేయాలి : శత్రుచర్ల

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ప్రభుత్వ అనుమతుల్లేకుండా నడుపుతున్న ఇసుక రీచ్‌లను నిలిపివేయాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరమరాజు అన్నారు. మండలంలోని రామభద్రపురం ఇసుక రీచ్‌ను మండల టిడిపి అధ్యక్షులు ఎస్ శేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో కలిసి సోమవారం పరిశీలించి, అడ్డుకున్నారు. అనంతరం విజయరామరాజు మాట్లాడుతూ గతంలో ఒక ప్రైవేట్ కంపెనీకి ఇసుక రీచ్ అనుమతులు ఇచ్చినప్పటికీ అనుమతులకు మించి ఇసుకను వాడుకున్నారన్నారు. అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే రీచ్‌ను నిలిపివేశారన్నారు. ప్రస్తుతం ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ కంపెనీకి అనుమతులు ఇచ్చారంటూ గత వారం రోజులుగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. ఇసుక రీచ్ వద్దకు వచ్చి అనుమతులు చూపించమని అడిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలని రీచ్ సంబంధిత కంపెనీ వారు చెప్పడం దారుణమన్నారు. కనీసం రీచ్ వద్ద అనుమతి పత్రాలు చూపించలేని పరిస్థితిలో ఇసుక అక్రమ రవాణా చేయడం అన్యాయమన్నారు. ప్రధాన రహదారిపై అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుంటే కేవలం అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఫోన్లో స్థానిక తహశీల్దార్ రమేష్‌కు, ఎస్సై నీలకంఠంకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి, వారు రీచ్ వద్దకు వచ్చి అనుమతుల కాగితాలు ఇవ్వాలని సంబంధిత కంపెనీ ప్రతినిధులను కోరారు. ఈ విషయంపై ఇరువురు అధికారులు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సమాచారాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. తక్షణమే అనుమతులు చూపించిన తర్వాత ఇసుక తరలింపు జరగాలని అంతవరకు ఇసుక రీచ్‌ను నిలుపుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ అక్రమాలపై అధికారులు పట్టించుకోరా? : సిపిఎం

మండలంలో ఇసుక రీచ్ వద్ద జరుగుతున్న అక్రమాలపై అధికారులు పట్టించుకోరానని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని రామభద్రపురం వద్ద ఇసుక రీచ్‌కు అనుమతుల్లేకుండా అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని వాపోయారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న విషయం తెలుసుకొన్న ఆయన సోమవారం స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి ఇసుక రీచ్ అనుమతులు ఉన్నాయా లేదా, అనుమతి లేకపోతే తక్షణమే వాహనాలు సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నియమావళికి లోబడి వార్తా కథనాలు ఉండాలి : జెసి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పని చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక తెలిపారు. ఎన్నికల నిర్వహణపై మీడియా ప్రతినిధులకు అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసి ఎన్నికల సమయంలో పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. ఎన్నికల నిర్వహణకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మీడియా ప్రతినిధుల పాత్ర ఎన్నికల సమయంలో కీలకమన్నారు. వార్తలు రాసే ముందు వాటి వాస్తవాలను పూర్తిగా పరిశీలించాలని కోరారు. వార్తలను ఇతరులు వక్రీకరించేందుకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించడంలో మంచి వార్తలు సహాయకారిగా ఉపయోగపడుతుందన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐపిసి తదితర నిబంధనలకు అనుగుణంగా వార్తలు రాయడంలో తగు జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వార్తలు రాయాలని కోరారు.

పెయిడ్ న్యూస్, ప్రకటనలను ఎంసిఎంసి పర్యవేక్షణ

మీడియా తన నైతికతను పాటించాలని శోభిక అన్నారు. పెయిడ్ న్యూస్ జోలికి వెళ్లొద్దని సూచించారు. పెయిడ్ న్యూస్‌ను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎం.సి.ఎం.సి) పర్యవేక్షిస్తుందని చెప్పారు. పెయిడ్ న్యూస్ రాయడం వల్ల పోటీలో ఉన్న అభ్యర్థి వ్యయ ఖాతాలో ఆ విలువను జమ చేయడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రకటనలకు అనుమతులు పొందేందుకు గుర్తింపు పొందిన పార్టీలు కనీసం మూడు రోజుల ముందు, గుర్తింపు లేని పార్టీలు కనీసం వారం రోజుల ముందు అనుమతికి ఎంసిఎంసికి దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు రాత ప్రతి (స్క్రిప్ట్) సంబంధిత అభ్యర్థి సంతకంతో సమర్పించాలని, దీంతో పాటు సిడి సమర్పించాలన్నారు. తయారీకి అయిన ఖర్చు వివరాలు కూడా తెలియజేయాలని చెప్పారు. పోలింగ్ రోజున, ముందు రోజున ప్రింట్ మీడియాలో ప్రచురించే ప్రకటనలకు అనుమతులు అవసరమని ఆమె స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వి సూర్యనారాయణ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌వై నాయుడు

జీతాలివ్వాలని కార్మికుల ధర్నా

- మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయింపు
- నాలుగు రోజుల్లో చెల్లింపు : చైర్ పర్సన్

ప్రజాశక్తి -సాలూరు

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల రెండు నెలల జీతాలు, పండుగ నెల అడ్వాన్స్ వెయ్యి రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ కార్మికులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన ఉదయం 10 గంటలకే కార్మికులు కార్యాలయం వద్ద బైఠాయించారు. సాధారణ సమావేశానికి హాజరు కావాల్సిన కౌన్సిలర్లు, చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ నగరపంచాయితీల్లో లేని సాంకేతిక సమస్యలు ఇక్కడే ఎందుకు వస్తున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు, ఉద్యోగుల జీతాలు నెలనెలా ఖాతాల్లో పడుతున్నప్పుడు ప్రజారోగ్య పరిరక్షణ కోసం పని చేస్తున్న కార్మికుల జీతాలు పంపిణీ ఎందుకు జాప్యమవుతోందని ప్రశ్నించారు. చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ మాట్లాడుతూ కార్మికుల సమస్యల్ని తాను అర్థం చేసుకున్నానని, నాలుగు రోజుల లో పంపిణీ జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మేనేజర్ రాఘవాచార్యులను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు కౌన్సిలర్ లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ వున్నారు.

లక్షలు లంచం ఇచ్చిన పనులే చేస్తారా?

- షాపు అద్దె గోల్ మాల్ పై విచారణ జరపాలి
- కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్లు ఆగ్రహం
- షాపు అద్దె పై విచారించి చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో లక్షల రూపాయలు లంచాలిచ్చిన పనులే చేస్తారా? సామాన్యుల పనులు చేయరా? అంటూ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు నిలదీశారు. చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో సోమవారం వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తొలుత వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ తాను ఏడాది క్రితం ఇంటిపేరు మార్పునకు సంబంధించి అన్ని పత్రాలతో ఉన్న దరఖాస్తుదారునికి సిఫార్సు చేశానని, ఇంతవరకు ఆ పని చేయలేదని చెప్పారు. లక్షలు లంచాలు ఇచ్చిన వారి పనులు చీకట్లో చేసేస్తారు, కానీ అన్నీ సవ్యంగా ఉన్నా సామాన్యుల పనులు చేయరా అని నిలదీశారు. వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబర్ షాపు అద్దెను వసూలు చేశారా? లేదా? లేకపోతే ఆ అద్దె డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్లాయో తేల్చాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దీప్తి కమిషనర్ ప్రసన్నవాణిని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ షాపు అద్దె గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. షాపు అద్దె చెల్లించలేదని ఛార్టర్డ్ అకౌంటెంట్ నేరుగా రెవెన్యూ అధికారులకే చెప్పారని, ఆయన వద్ద నుంచి అద్దె డబ్బులు ఎందుకు వసూలు చేయలేదని కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీనికి ఆర్వో రాఘవాచార్యులు, ఆర్‌ఐ శ్రీనివాసరావు సమాధానాలు చెప్పలేక నీళ్ళు నమిలారు. వార్డుల్లో అభివృద్ధి పనులు జరగకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కాంట్రాక్టర్లకు చెప్పి చిన్న వర్కులైనా చేయించాలని కౌన్సిలర్ గొర్లె వెంకటరమణ కోరారు. మున్సిపాలిటీలో మొదటి విడత ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు సంబంధించి సచివాలయాలకు మంజూరైన నిధులు ఏమయ్యాయో తేల్చాలని కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు డిమాండ్ చేశారు. పట్టణంలో పాత ఇళ్లకు అన్ని రకాల ధ్రువపత్రాలు ఉండవని, వాటికి సంబంధించిన పేర్ల మార్పు వంటి సమస్యలకు మినహాయింపు ఇవ్వాలని వైస్‌చైర్మన్ అప్పలనాయుడు కోరారు. తన వార్డులో కూడా ఇంటిపేరు మార్పునకు సంబంధించి ఒక వ్యక్తి దరఖాస్తు చేసుకుని చాలా కాలమైందని, ఇంతవరకు ఆ పని చేయలేదని కౌన్సిలర్ లింగాల దుర్గా ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పనికి ఎంత లంచం ఇవ్వాలో స్పష్టంగా అధికారులు చెప్పాలని కౌన్సిలర్ రాపాక మాధవరావు డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఏ పని చేయడానికైనా కొన్ని నిబంధనలు వుంటాయని చెప్పారు. ఇంతవరకు పరిపాలనలో ఎదురు కాని ఇబ్బందులు గత పదిరోజులు గా ఎదురవుతున్నాయని ఆమె అన్నారు.



సమస్యలపై నిలదీస్తున్న వైస్‌చైర్మన్ దీప్తి

మళ్లీ వాయిదా

మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన కాంట్రాక్టర్, జెసిబి నడపడానికి ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్ నియామకానికి సంబంధించిన అంశాన్ని కౌన్సిలర్లు మరోసారి వాయిదా వేశారు. గత నెలలో జరిగిన సాధారణ సమావేశంలోనూ ఈ అంశాన్ని కౌన్సిలర్లు వాయిదా వేశారు. పారిశుధ్య విభాగంలో సరిపడినంత మంది డ్రైవర్లు వున్నారని, వారికి తర్ఫీదు ఇచ్చి వాడుకుంటే సరిపోతుందని కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు చెప్పారు. ఈ అంశంపై మాట్లాడడానికి శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజు సమావేశానికి హాజరు కాలేదు. ఆయన సెలవులో వున్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ డిఇ శ్రీరామ్మూర్తి, ఎఇ సూరి నాయుడు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి


జెసికి ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) అధికారులను నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ శోభికకు సోమవారం వినతిని అందజేశారు. జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటిస్థలం కేటాయింపు వెంటనే జరిగేందుకు వీలైన చర్యలు కోరారు. ఇటీవల రెండో విడతలో కూడా జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్నారని గుర్తు చేశారు. వెంటనే మండల, జిల్లా స్థాయిలో జాబితాను సిద్ధం చేసి స్థలాలను గుర్తించాలని కోరారు. త్వరలో ఎన్నికల నోఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. స్థలాల ధరలు కూడా నిర్ణయించి ముందుగా తెలియజేస్తే తప్ప జర్నలిస్టులు అప్పటికప్పుడు చెల్లించుకునే పరిస్థితి లేదని తెలిపారు. కావున త్వరితగతిన జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటిస్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందిస్తూ ఈ విషయమై రెవెన్యూ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. దరఖాస్తుల నిర్ధారణపై డిపిఆర్‌ఒతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాకిముక్కల నాగు, ఎస్.పట్నాయక్, శేఖర్, సోమశేఖర్, నవీన్‌కుమార్, పోలినాయుడు, ఆర్.శంకరరావు, పెద్ద ఎత్తున విలేకరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడుల నిరోధానికి చర్యలు చేపట్టాలి

జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో వారికి రక్షణ కల్పించాలని, దీనిలో భాగంగా దాడుల నిరోధ కమిటీ జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో వారికి రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్పీలకు ఈ వినతిపత్రాన్ని అందజేశామన్నారు. విధినిర్వహణలో ఉండే జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులపై దాడుల నిరోధానికి జిల్లాలో ఉన్నత స్థాయి పోలీసు అధికారుల నేతృత్వంలో దాడుల నిరోధ కమిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే జిల్లా స్థాయిలో దాడుల నిరోధ కమిటీలను నియమించాలని ఎస్పీని కోరామన్నారు. విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి జరిగితే వారికి ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి రక్షణ ఉంటుందో అటువంటి చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. రాష్ట్రస్థాయిలో హైపవర్ కమిటీ, జిల్లాస్థాయిలో దాడుల నిరోధ కమిటీల ఏర్పాటు చేయాలని ఎస్పీని కోరారు. వినతిని అందజేసిన వారిలో యూనియన్ నాయకులు కాకిముక్కల నాగు, ఎస్.పట్నాయక్, శేఖర్, సోమశేఖర్, నవీన్‌కుమార్, పోలినాయుడు, ఆర్.శంకరరావు, పెద్ద ఎత్తున విలేకరులు ఉన్నారు.



జెసి శోభికకు వినతిని అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు



బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్

ఫ్లై ఓవర్‌పై ఆర్టీసి బస్సు బ్రేక్ ఫెయిల్

స్తంభించిన ట్రాఫిక్... ఆందోళనలో ఇంటర్ విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెళ్తున్న ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్ అయి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటనతో ఇంటర్ పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థులు బస్సు దిగి పరీక్ష కేంద్రాలకు పరుగుపెడుతూ నానా ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



కేక్ కట్ చేస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక ఐటిడిఎలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ కల్పనాకుమారి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఒకరిపై ఆధారపడకుండా జీవిస్తున్నారని అన్నారు. మహిళలు చాలా కష్టాలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చారని అన్నారు. మహిళలు తమ జీవితంలో చాలా త్యాగాలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు పిఒ బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, ఇఇ సింహాచలం, డీడీ అన్నాదొర, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, ఎంపిడిఒ గీతాంజలి, డిప్యుటీ డిఇఒ లిల్లీరాణి, సిడిపిఒ రంగలక్ష్మి, పిఎంఆర్‌సి బృందం, వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని పాలకొండ ఆర్‌డిఒ బివి రమణ అన్నారు. మండలంలోని వన్నాం పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 60 పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు వికలాంగులకు అనుకూలంగా ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద విద్యుత్తు, మరుగుదొడ్ల సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ బూతుల్లో ఎటువంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రం వద్ద మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయంతో పాటు తాగునీరు, ర్యాంపులు సదుపాయం కల్పించాలని ఆదేశించారు. అధికారులు ఎన్నికల సందర్భంగా ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ రమేష్, ఎస్ఐ నీలకంఠం, డిఇఒ నారాయణస్వామి ఉన్నారు.



నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి పరిహారమివ్వాలి

ప్రజాశక్తి-పాలకొండ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు మురళీకృష్ణ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి నష్టపరిహారంతో పాటు అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇద్దరు బిడ్డలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్మికులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటి యు) పాలకొండ నగర పంచాయతీ కమిటీ కార్యదర్శి సిహెచ్ సంజీవి, కోశాధికారి పి.వేణు, పి.మధు, చింతల రఘు, వండాన ఆంజనేయులు, బి విశ్వేశ్వరరావు, నాగవంశం సాయి తదితరులు పాల్గొన్నారు.

14న రైతుల చలో ఢిల్లీ

ప్రజాశక్తి - సీతానగరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం డిసెంబర్ 21న రాతపూర్వక ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 14న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిషోర్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చాయి. రైతు పండించే పంటకు మద్దతు ధర చట్టాన్ని గురించి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. స్వామినాథ కమిటీ సిఫార్సు ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర చట్టం రావాలని, రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దీనికి మద్దతుగా అన్ని మండల కేంద్రాలలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు చేస్తామని ఆయన తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు మరో నోటీసు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కమిషనర్ పి.ప్రేమప్రసన్నవాణికి మరో కోర్టు ధిక్కార నోటీసు జారీ అయింది. పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ స్థలానికి సంబంధించిన వివాదంలో రాజా గౌరీదేవి అలియాస్ మీసాల గౌరీదేవి కోర్టులో కేసు వేశారు. ఆమె కూడా గత ఏడాది డిసెంబర్ 28న అప్పటి కమిషనర్ జయరాం నిర్వహించిన విచారణకు హాజరయ్యారు. విచారణ ప్రోసీడింగ్ కాపీని తన క్లయింట్ గౌరీదేవికి ఇవ్వనందున ఆమె తరపు న్యాయవాది రేగు మహేశ్వరరావు కమిషనర్ ప్రసన్న వాణికి నోటీసు పంపించారు.

తాగునీటి సమస్యపై దృష్టి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి తాగునీటి వనరులను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా బోరు బావులు మొరాయించినట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే సమస్య పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. యూనిఫారం ధరించి విధులకు హాజరుకావాలన్న నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని అందుబాటులో ఉండే సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎఒ వై.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి టివిఆర్ మూర్తి, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు .

మాయమాటలు నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో సభ

ప్రజాశక్తి - బలిజిపేట

రాబోయే ఎన్నికల్లో ఓటు కోసం టిడిపి నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రజలకు అండగా ఉండే వైసిపిని ఆదరించాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం వైఎస్‌ఆర్ చేయూత పథకం చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు కోసం పనిచేసే ప్రభుత్వం వైసిపి అని అన్నారు. ప్రతిపక్షాల మాయమాటలకు ప్రజలు మోసపోకూడదని, వారిచ్చే హామీలు వైసిపి ఒక్క పథకానికి కూడా సరితూగవని అన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు పాలవలస మురళి, ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, వైస్ ఎంపిపి వి.సాయిరాం, పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు నిర్వహిస్తున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అన్నారు. ఒకవైపు పాఠశాల తరగతులు జరుగుతుంటే మరోవైపు పెద్దపెద్ద శబ్దాలతో సుమారు 6వేల మంది జనాభాతో పాఠశాలలో సమావేశాలు నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు. పిల్లలు చదువుకు ఒక భయంకర వాతావరణ సృష్టించి వారి తరగతుల నిర్వహణకు ఆటంకం కలిగేలా పాలకులు, అధికారులు వ్యవహరించారని విమర్శించారు. అలాగే సమావేశానికి వచ్చిన మహిళలు ఎండ తీవ్రత తట్టుకోలేక బయటకు వెళ్లిపోతుంటే సీసీలు అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. మహిళలకు ఇష్టం ఉన్నా లేకున్నా వారికి డబ్బులు ఇస్తామన్న సాకుతో సభలకు రప్పించడం, వారిని బలవంతంగా ఉంచడం సరైన పద్ధతి కాదన్నారు. నిబంధనలను పాటించాల్సిన పాలకులు పాఠశాలలో తరగతులు జరుగుతున్న సమయంలో ఇలా సభలు నిర్వహిఒంచడం ఎంత వరకు సమంజసమని సర్వత్రా చర్చ జరుగుతోంది.



మహిళా సంఘ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పాలకొండ : ప్రభుత్వం ప్రకటించిన వైఎస్సార్ చేయూత ద్వారా నగరపంచాయితీ పరిధిలోని 1864 మంది లబ్ధిదారులకు నాలుగు విడతలుగా రూ.13కోట 14లక్షల, 37500 లబ్ధిదారుల అకౌంట్లను జమ చేసినట్టు స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయ ఆవరణలో విప్ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి చేయూత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ ఛైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్ మరియు కౌన్సిలర్లు ఉన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

జనన ధ్రువపత్రాలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - బెలగాం

గిరిజన పిల్లలకు ఆధార్ కార్డుల కోసం జనన ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరుతూ గిరిజన పిల్లల తల్లిదండ్రులతో కలిసి సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ మాట్లాడుతూ పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ పనసభద్ర గ్రామానికి చెందిన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆధార్ కార్డు మంజూరు కాక విద్య, వైద్యం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు గిరిజన విద్యార్థులు దూరంగా ఉండే పరిస్థితి ఉందని అన్నారు. కావున తక్షణమే అధికారులు స్పందించి జనన ధ్రువీకరణ పత్రం అందజేయాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ కె.హేమలతకు వినతిని అందజేశారు. దీనికి ఆమె స్పందిస్తూ ఐటిడిఎ కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ సెంటర్‌కు వెళ్లి మీ సమస్య పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, ఆర్.ఈశ్వరరావు, కె.ఈశ్వరరావు, తోపుడు బళ్ళు సంఘం పట్టణ అధ్యక్షులు సూరిబాబు, గిరిజన సంఘం జిల్లా నాయకులు పి.రాము, నాయకులు, పనసభద్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతుల విజయం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రకృతి వ్యవసాయంలో రైతులు విజయం సాధిస్తున్నారని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాబర్ట్ పాల్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ, రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన రైతు నుంచి వినియోగదారునికి నేరుగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాబర్ట్ పాల్ మాట్లాడుతూ పల్లెలు సస్యశ్యామలంగా ఉన్నాయంటే వ్యవసాయమే కారణమన్నారు. కొంతమంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి సేద్యం గత కొంత కాలంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రసాయన సేద్యంతో నష్టపోయిన రైతులు, ప్రకృతి వ్యవసాయం చేయడంలో లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం అతి తక్కువ ఖర్చుతో గో- ఆధారిత సహజ ఎరువులు, మిశ్రమాలతో ప్రకృతిలో సహజంగా దొరికే వనరులతో కషాయాలు, నూనెలు తయారు చేసుకుని, భూసారాన్ని పెంచుకుంటూ, చీడపీడల్ని నివారించుకుంటూ అధిక దిగుబడులతో పాటు పర్యావరణాన్ని కాపాడుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన రసాయనరహిత ఆహారాన్ని రైతులు అందిస్తున్నారని వివరించారు. ఈ శిబిరంలో రైతులు ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా పండించిన బియ్యం, మిల్లెట్స్, బెల్లం, కూరగాయలు మొదలైనవి విక్రయిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి వివిధ పథకాలు ప్రకటించాయని, వివిధ శాఖల సమన్వయంతో ఈ వ్యవసాయంలో పాటించాల్సిన ముఖ్య సూత్రాలు, రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఆచరించాల్సిన ముఖ్య విధానాలను అమలులోకి తెచ్చిందని రాబర్ట్ పాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ జిల్లా అధికారి పి. షణ్ముఖరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి-పాలకొండ

రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపిపి బొమ్మాలి భాను అన్నారు. వేసవిలో మండుటెండల దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యల పరిష్కారం కోసం క్రాస్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఎంపిపి, వైస్ ఎంపిపి సూర్యప్రకాష్, అనిల్ సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీ లలో ఎక్కడా ఎలాంటి నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, బోర్ మెకానిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందులో భాగంగా వారి సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఆర్‌బికెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని పెదబుడ్డిడిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, అలాగే తురకనాయుడువలసలో మరో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే తమ ధ్యేయమని, వీరిని అన్ని విధాలా ఆదుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎం.శశికళ, ఉషారాణి, గౌరీశంకర్రావు, ఎం.కిషోర్, వైస్ ఎంపిపి సంపత్‌కుమార్, పెద్దబుడ్డి సర్పంచ్ సీమల సుజాత, ఉపసర్పంచ్ రేవళ్ల తిరుపతినాయుడు, ఎంపిటిసి సభ్యులు ఆర్.జ్యోతిశ్రీ, తురక నాయుడువలసకు చెందిన భీమవరపు సింహాచలం, కెంగువ వెంకటి నాయుడు, సింహాచలం మాస్టారు, కారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు భవనం ప్రారంభం

కొమరాడ : విద్యార్థుల సౌకర్యాల మేరకు అదనపు భవనాన్ని ప్రారంభించడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని నాగావళి నది ఆవల గల వన్నాం లో కొత్తగా నిర్మించిన మండల ప్రాథమిక పాఠశాల అదనపు భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నాడు నేడు పనులను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరంగా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అలాగే ఏజెన్సీ ఏరియాలో కూడా పక్కా భవనాలు నిర్మాణాలు చేపట్టి పేద విద్యార్థులకు ఉన్నత చదువులను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని అన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుకూలంగా ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేసి వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని, కావున పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని మంచి ఉత్తీర్ణత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంఇఒ జామి నారాయణస్వామి, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెదబుడ్డిడిలో ఆర్‌బికె కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

2024-25 విద్యాసంవత్సరానికి కురుపాం కస్తూరిబా బాలికల విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఐ.కిరణ్‌కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 12 నుంచి ఆన్లైన్‌లో https://apkgbv.apfss.in అడ్రస్ కు ఏప్రిల్ 11లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6వతరగతి -40సీట్లు, 7వతరగతి-01, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి -40సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల వివరాలు, అభ్యర్థి పాస్ ఫోటో, మొబైల్ నెంబర్ ఉండాలని, మరిన్ని వివరాల కోసం పాఠశాల పని వేళల్లో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల్లోపు సంప్రదించ వచ్చునని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలతో నేరుగా పాఠశాలకు వస్తే అక్కడే దరఖాస్తులు ఆన్లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సమస్యల నివారణకు కృషి : డిఎంఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణులు, పిల్లల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించి, వాటిని నివారించే దిశగా కృషి చేయాలని డిఎంఒ డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. మండలంలోని బివి పురం, ఉల్లిభద్రలో అంగన్వాడీ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించి రికార్డుల్లో నమోదు చేసిన నివేదికలతో సరిచూశారు. పౌష్టికాహారం, ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను ఏ విధంగా గుర్తిస్తున్నారు, వారి ఆరోగ్యం మెరగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు తదితర వివరాలపై ఆరా తీశారు. అలాగే గర్భిణులు, బాలింతలతో ఆయన మాట్లాడి ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా, పౌష్టికాహారం అందజేస్తున్నారా, వైద్య సిబ్బంది గృహ సందర్శనలకు వచ్చి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్నారా మొదలగు అంశాలపై వారిని అడిగి ప్రిజం-10 గురించి, వాటి ఉద్దేశ్యం, కార్యాచరణపై వివరించారు. అనంతరం వైద్య, అంగన్వాడీ సిబ్బందికి గర్భిణీ, శిశువుల్లో ఆరోగ్య సమస్యలను ప్రాథమికంగా ఎలా గుర్తించాలో వివరించారు. సిబ్బంది సమిష్టి కృషితో పని చేసి మాతా,శిశు ఆరోగ్య వృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం గ్రామంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా, వైద్య సిబ్బందిని అడిగి డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పార్వతి, మాలతి, అనిత, అంగన్వాడీ సిబ్బంది లావణ్య, కల్పన, గౌరమ్మ, సుభాషిని, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గర్భిణీలకు వైద్య తనిఖీలు

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, ఎత్తు, రక్తపోటు మధుమేహం తదితరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, వైద్యాధికారులు ఇచ్చే సలహాలు పాటించాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు .

ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, మండల అధ్యక్షులు బలగ శంకరరావు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జెసి ఎస్.ఎస్.శోభితను కలిసి జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గల నాగావళి, వంశధార, సువర్ణముఖి తదితర నదులతో పాటు జిల్లాలో గల పలు గెడ్డల నుంచి రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్నారు. ముఖ్యంగా కొమరాడ, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, పాలకొండ, వీరఘట్టం, సాలూరు తదితర మండలాల్లో గల నదులు, గెడ్డల నుండి ఇసుక అక్రమంగా తవ్వకాలు చేస్తూ రవాణా చేస్తున్నారన్నారు. దీనివల్ల పర్యావరణానికి ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై జెసి స్పందిస్తూ తగు చర్యలు చేపట్టాల్సిందిగా మైనింగ్ అధికారిని ఆదేశించారు.

గిరిజన గ్రామానికి విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని డికెపట్నం పంచాయతీ పరిధిలోని కొత్త డికెపట్నం గ్రామానికి చాలా కాలంగా విద్యుత్ సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామంలో 10 కుటుంబాలు నివసిస్తున్నాయి. విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తీసుకురాగా, ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఆ గ్రామానికి విద్యుత్ సదుపాయం కల్పించారు. ఈ మేరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎడిఎ వెంకటరమణ, ఎఇ రామారావు సోమవారం ప్రారంభించి, ఆ గ్రామానికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఎమ్మెల్యే చొరవకు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ బొమ్మి రమేష్, ఎంపిపి ప్రతినిధి మజ్జి చంద్ర శేఖర్, వైస్ ఎంపిపి బంకరు రవికుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేరుశెనగ సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకంలో భాగంగా మండలంలోని చినంకలాంలో వేరుశనగ పంటను గూర్చి, వాటిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడిని సాధించేందుకు తగిన మెళుకువలను మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ రైతులకు వివరించారు. తెలియచేశారు. వేరుశనగలో దిగుబడులు తగ్గడానికి విత్తన మోతాదు తగ్గించి నాటడం, మొక్కల సంఖ్య తక్కువగా ఉండడం, విత్తనశుద్ధి పాటించకపోవడం, పాత విత్తనం వాడుకతో మొలకశాతం తగ్గటం, దగ్గరగా నీటి తడులు ఇవ్వడం, కలుపు నివారణ చేయకపోవడమేనని తెలిపారు. అలాగే ఈ పంటలకు ఆశించిన వివిధ రకాల తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవముఠా పరిధిలో ఉన్న ఆరు గిరిజన గ్రామాల్లోని గిరిజనులు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి సమక్షంలో చేరారు. గొయ్యిపాక, రాస్తాబడి, గుల్లంక, కిత్తలంబ, కుంతేసు తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ఆయా గ్రామాల నాయకుల ఆధ్వర్యాన చేరారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శనరావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, మహిళ కార్యదర్శి వెంకటాపు భారతి, నాయకులు సుందర్ రావు, రమేష్, కిల్లకదాసు, తాడంగి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - బలిజిపేట

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 18 నుంచి జరగనున్న నేపథ్యంలో స్థానిక హై స్కూల్లో పరీక్షల ఏర్పాట్లను ఎంఇఒ-1 సామల సింహాచలం సోమవారం హెచ్ఎం జయ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల్లో ఎటువంటి భయం లేకుండా రాయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చక్కగా పరీక్షలు రాసేందుకు సరిపడే గదులు, ఫర్నీచర్, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వంతరాం పరీక్షా కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎల్విన్ పేట సమీపంలో లారీ బోల్తా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాజమండ్రి నుండి రాయపూర్ మీదగా అల్యూమినియం లోడుతో ఢిల్లీ వెళ్తున్న లారీ ఎల్విన్‌పేట సమీపంలో సోమవారం అర్ధరాత్రి బోల్తా పడింది. ఈ సంఘటనతో లారీ డ్రైవర్ తలకు స్వల్ప గాయమైంది. గాయపడిన వ్యక్తిని 108లో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి వేళ ప్రధాన రహదారిపై లారీ బోల్తాపడడంతో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

రెండు కార్లు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

గరుగుబిల్లి : మండలంలో సీతారాంపురం సమీపంలో ఎదురు ఎదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రమాదం జరిగిన సమయంలో బెలూన్ తెరుచుకోవడం వల్ల ఈ సంఘటన జరిగింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలయ్యాయి.



సాయిరాం కాలేజీలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

పట్టణంలో టిడిపికి ఆదరణ : బోనెల

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పట్టణంలో అన్ని వార్డుల్లో ప్రజలు టిడిపికి ఎనలేని ఆదరణ చూపిస్తున్నారని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. మున్సిపాలిటీలోని 16వ వార్డు సాయిరాం కాలనీలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి.శ్రీదేవితో కలిసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా చంద్రబాబు మేనిఫెస్టో సూపర్ సిక్స్ అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, మధు, మజ్జి వెంకటేష్, సీతారాం, జనసేన, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో మరిపల్లి పంచాయతీలో నాగరగూడ, నాగర తదితర గిరిజన గ్రామల్లో టిడిపి అభ్యర్థి టి.జగదీశ్వరి గెలుపునకు ఎంపిపి బొంగు సురేష్, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్ ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు హెచ్. సుబ్బలక్ష్మి, సుక్కు, టిడిపి నాయకులు శ్రీను, రమేష్, మన్మథ తదితరులు పాల్గొన్నారు.